నిధులు కేటాయించాలని సీఎంకు వినతి



వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారుల నిర్మాణం, అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే వనస్థలిపురంలో శిథిలమైన హుడా ఓపెన్ ఆడిటోరియం స్థలంలో అన్ని హంగులతో మినీ రవీంద్రభారతిని నిర్మించాలని వినతిలో కోరారు.

ఫ్లెక్సీల తొలగింపు సరికాదు

లింగోజిగూడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఉదయం తొలగించడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటు వ్యక్తులు రోడ్లకు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని, ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు ముఖ్యమంత్రి ఫ్లెక్సీలను వెంటనే తొలగించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఎంట్రీ ఫారాలు లేక ఇబ్బందులు

చాదర్‌ఘాట్: కులగణన సర్వేలో ఓల్డ్‌మలక్‌పేటలో ఉర్దూ, ఇంగ్లిష్ సర్వే ఎంట్రీ ఫారాలు లేక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై డీసీని సంప్రదించగా వాస్తవానికి ఉర్దూ, ఇంగ్లిష్ ఎంట్రీ ఫారాలు లేవని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలో ఉర్దూ, ఇంగ్లిష్ ఫారాలు తెప్పిస్తామని డీసీ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని యాదగిరినగర్, పద్మానగర్ కాలనీల్లో రూ. 55 లక్షల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములైతే త్వరితగతిన పూర్తవుతాయన్నారు. కార్పొరేటర్ వెంట జయవర్ధన్‌రెడ్డి, ముత్యాల వీరారెడ్డి, శ్రీనివాసరావు, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఆంజినేయులు, నాయకులు శ్రీకాంత్, సుమిత్, వేణుగౌడ్ ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మన్సూరాబాద్: డివిజన్ పరిధి విజయశ్రీ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు గురువారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీధర్‌రెడ్డి, రాంచందర్, జంగయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా మార్గం రాజేష్, కోశాధికారిగా మధుసూదన్‌రెడ్డి, కార్య నిర్వాహక కార్యదర్శిగా జంగయ్య, ఎల్‌ఎంరెడ్డి, సురేందర్‌గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా రమణారెడ్డి, అరవింద కుమార్, సురేష్‌రెడ్డి, సభ్యులుగా అల్వాల్‌రెడ్డి, మనోహర్, శ్రావణ్‌కుమార్, ఈదయ్య, శ్రీనివాస్, యాదిరెడ్డి, లింగస్వామి, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల ప్రక్రియ కమిటీ సభ్యులు నర్సిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, కృష్ణయ్య, బాలరాజు, సత్తిరెడ్డి తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.29, వంకాయ రూ.50, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.37, క్యారెట్ రూ.65, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.40, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.40, సొరకాయ రూ18, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.70, చామగడ్డ రూ.38, మునగ రూ.50, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.50, కీర రూ.17, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.80. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఇరుకు రోడ్డులో రాకపోకలు.. ప్రమాదపుటంచున విద్యార్థులు!

- పాఠశాల ముందు నుంచి బస్సుల ప్రయాణం
- రూటు మార్చాలంటున్న ఉపాధ్యాయులు
- విస్మరిస్తున్న ఆర్టీసీ అధికారులు



పాఠశాల ముందు నుంచి వెళ్తున్న బస్సు

వనస్థలిపురం: ప్రభుత్వ పాఠశాలల వద్ద రక్షణ కరువై విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూడ్రోజుల క్రితం హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు వద్ద ఆడుకుంటున్న విద్యార్థి అజయ్‌పై గేటు పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. పాఠశాల లోపల జరుగుతున్న ఘటనలు ఓ వైపు అయితే.. పాఠశాల ముందు నుంచి బస్సులు దూసుకెళ్తుండటంతో ఇక్కడ కూడా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

1200 మంది విద్యార్థులు..

వనస్థలిపురం షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. రెండు పాఠశాలలు కలిపి విద్యార్థుల సంఖ్య దాదాపు 1200 వరకు ఉంటుంది. పాఠశాల ముందు నుంచి ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుండటంతో పెను ప్రమాదం పొంచి ఉంది. ఉదయం, సాయంత్రం, విరామం సమయంలో విద్యార్థులు పాఠశాల బయటకు వస్తుంటారు. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

నగరం నుంచి వచ్చే బస్సులు వనస్థలిపురం షాపింగ్ కాంప్లెక్స్ మీదుగా పాఠశాల ముందు నుంచి హయత్‌నగర్ వైపు వెళ్తుంటాయి. అయితే పాఠశాల ప్రారంభమయ్యే ఉదయం, మధ్యాహ్నం, ఇళ్లకు వెళ్లే సమయంలో విద్యార్థులు రోడ్డుపైకి వస్తుంటారు. అసలే ఇరుకు రోడ్డు కావడంతో ఎక్కడ ప్రమాదాల బారిన పడతారోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వనస్థలిపురంలో 60 ఫీట్లతో విశాలంగా ఉన్న గురుద్వార్ రోడ్డు, జ్యోతి చికెన్ సెంటర్ రోడ్డును వదిలేసి ఇరుకైన పాఠశాల రోడ్డులోనే బస్సులను తిప్పాల్సిన అవసరం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌టీసీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బస్సులను వేరే రూట్‌లో నడిపించాలి..

పాఠశాల ముందు నుంచి బస్సులు రాకపోకలు సాగిస్తుండటంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. బస్సులను వేరే రూట్‌లలో తిప్పాలని ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. తప్పని పరిస్థితుల్లో రోడ్డుపైకి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ విద్యార్థులకు సూచిస్తున్నాం. అలాగే పాఠశాల వదిలే సమయంలో రోడ్డుపై ఉపాధ్యాయులను కాపలాగా ఉంచుతున్నాం.

-దుర్గలత, ప్రధానోపాధ్యాయురాలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చంపాపేట సబ్‌స్టేషన్ పరిధి శ్రీనివాసనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీనివాసనగర్, శ్రీరాంనగర్, తపోవన్, గ్రీన్‌పార్క్ కాలనీలు. మారుతీనగర్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు న్యూమారుతీనగర్, మారుతీనగర్, పూసలబస్తీ, ఈస్ట్‌మారుతీనగర్, అంబేడ్కర్‌వాడ, ముస్లీంబస్తీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

- **ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..**

లక్ష్మీనగర క్రాస్‌రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగె, ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ, ధోబీఘాట్ రోడ్.

- **మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..**

ఆస్మాన్‌ఘడ్, వెంకటాద్రినగర్, గడ్డిఅన్నారం, ఆర్‌బీకాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



హస్తినాపురం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పీవీ రాంరెడ్డి పీజీ కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్రమశిక్షణ, సమయ పాలనను ప్రతి ఒక్కరూ పాటించి టీంవర్క్ చేసినట్లైతే మంచి విజయాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన అకాడమీ అండ్ రీసెర్చ్ సెంటర్ ఎండీ జ్ఞానసాగర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ డీ.శ్రీనివాస్, హెచ్‌ఓడీ ఎం.మహేశ్ పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషిచేస్తా



ఎన్‌జీఓఎస్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు.డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీలలో రోడ్ల నిర్మాణానికి రూ.78 లక్షలు మంజూరు చేయించినందకు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కావెంకటేశ్వర్లు, శరత్, జైపాల్‌రెడ్డి, సుధీర్, కామేష్, మధు, రమేష్, వేణు, వినయ్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే దేశానికే ఆదర్శం



సర్వేలో పాల్గొన్న డీసీ సుజాత



కార్పొరేటర్ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శమని కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవికాలనీలో చేస్తున్న కులగణన సర్వేను సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత పర్యవేక్షించారు. సర్వేలో పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీల కులగణన ఆర్థిక, అసమానతలు వివక్షను రూపుమాపడానికే, తెలంగాణ కులగణన భారత దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. కులగణన అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు.

సర్వేకు సహకరించండి..

చైతన్యపురి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేకు అందరూ సహకరించాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత సిబ్బందితో డివిజన్‌లో సమగ్ర సర్వే ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా నివాసానికి వెళ్లి వివరాలు సేకరించి స్టిక్కర్ వేశారు.

'మతోన్మాదంతో రాజకీయం చేస్తున్న బీజేపీ'



మాట్లాడుతున్న జంగయ్య

మన్సూరాబాద్: బీజేపీ మతోన్మాదం పేరుతో రాజకీయం చేస్తుందని సీపీఐ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సీపీఐ హయత్‌నగర్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం మండల సహాయ కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే సీఎం రేవంత్‌రెడ్డి హామీలిస్తున్నారని, ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఘనత సీపీఐకి దక్కుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే సంకల్పంతో పార్టీని బలోపేతం చేస్తున్నామని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అన్ని డివిజన్ల నుంచి సీపీఐ పోటీలో ఉంటుందన్నారు. పార్టీ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవీంద్రచారి, శేఖర్‌రెడ్డి, వంశీవర్ధన్‌రెడ్డి, రమావత్ నక్రునాయక్, అరుణ్‌కుమార్, శోభన్, సుజాత, యమునా, అనిత, సౌజన్య, వీరస్వామి, వెంకట్, అరుణ, జ్యోతి, నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న సుజాతానాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి వెంకటేశ్వరకాలనీలో కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు కల్పించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు.

సర్కిల్-6 ఇన్‌చార్జి డీసీగా సంజయ్‌సింగ్

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్-6 ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌గా సంజయ్‌సింగ్‌కు బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న డీసీ జయంత్ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో 10 రోజుల పాటు ఇన్‌చార్జి డీసీగా సంజయ్‌సింగ్‌ను నియమించినట్లు చార్మినార్ జెడ్సీ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



నాగేశ్వర్‌రెడ్డి



సునీత

లింగోజిగూడ: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కుంట్లూర్ తెలంగాణ నగర్‌లో ఉండే దేవిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి కుంట్లూర్ నారాయణ కళాశాలలో మెస్ సూపర్‌వైజర్‌గా చేస్తున్నాడు. ఈ నెల 2న రోజు తరహా రాత్రి 8 గంటల సమయంలో కళాశాలకు వెళ్లొస్తానని చెప్పి ఎంతకీ తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు రామిరెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో గృహిణి..

భాగ్యలత బీడీఎల్ కాలనీలో ప్రసాద్‌రావు, సునీత దంపతులు నివాసముంటున్నారు. ఈ నెల 6న మధ్యాహ్నం కర్రీస్ తీసుకొచ్చేందుకు ప్రసాద్‌రావు బయటకు వెళ్లి ఇంటికొచ్చే సరికి భార్య సునీత కనిపించలేదు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విజిబుల్ పోలీసింగ్‌కు సహకరించాలి



వాహన తనిఖీలో పాల్గొన్న ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: విజిబుల్ పోలీసింగ్‌కు ప్రజలు సహకరించాలని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతిరోజు ఎల్‌బీనగర్ డివిజన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా బుధవారం రాత్రి మన్సూరాబాద్‌లోని డబుల్ బెడ్రూమ్‌ల వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్‌లేని వాహనలు, ట్రిబుల్ రైడింగ్, నిషేధిత సరుకులు రవాణా చేయకూడదని వెల్లడించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు



జెడ్సీకి సమస్యలను వివరిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా బిగ్‌బజార్ నుంచి సుష్మా వరకు రోడ్డు విస్తరణకు చర్యలు చేపడుతామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి విజ్ఞప్తి మేరకు గురువారం ఆయన డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వివరించారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ.. బిగ్‌బజార్ నుంచి సుష్మా చౌరస్తా వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు. రోజు రోజుకు కాలనీలు వెలుస్తున్నాయని, గత కొన్నేళ్లుగా ఉన్న శానిటేషన్ సిబ్బందితోనే పనులు చేయాల్సి వస్తుందని, వారిపై పనిభారం పెరుగుతుందని, సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు.



ఘనంగా ఛట్‌పూజ

వనస్థలిపురం: ఉత్తర్ భారతీ నాగరిక్ సంఘ్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎన్‌కే.సింగ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వనస్థలిపురం శారదానగర్‌లో ఛట్ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఛట్‌పూజ వనస్థలిపురంలో జరగడం సంతోషకరమన్నారు. ఎన్‌కే. సింగ్ మాట్లాడుతూ.. దీపావళి పర్వదినం తర్వాత ఈ పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. కర్మన్‌ఘాట్‌లో గత 15 ఏళ్లుగా ఛట్ పూజ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, డా.దేవ్‌కుమార్, రవి కుమార్, నందకిషోర్‌సింగ్, అమర్‌జీత్‌సింగ్, శ్రావణ్ కుమార్, దివాకర్ పాల్గొన్నారు.



నాగోలులో..

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని బిహార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఛట్ పూజల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ..బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్ లోని కొన్ని ప్రాంతాల్లో ఛట్ పూజకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, బిహార్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.